

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**Voice of the leader**

ఎన్నికల ముందు యువతకు అనేక హామీలిచ్చి వారి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారి నెత్తిన భస్మాసుర హస్తం పెట్టారు. ఖాళీగా ఉన్న 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి.. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానంటూ యువతను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చాక ఎలాంటి జాబ్ క్యాలెండర్ విడుదల చెయ్యకుండా నిరుద్యోగులను వంచించారు. వచ్చే ఎన్నికల్లో యువతే వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలి.

- నారా చంద్రబాబునాయుడు


ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తే ఉపేక్షించేది లేదు - బొండా ఉమ 5

ఓటమి ఖాయమని తెలిసే వైకాపా నేతల అడ్డగోలు మాటలు : నాగుల్‌మీరా 4

తిరుమల పవిత్రతను మంటగలుపుతున్న వైసీపీ - బుచ్చి రాంప్రసాద్ 6


## ప్రతి సీటు గెలవాలి...

# అందరినీ కలుపుకొని సాగండి

- రానున్న ఎన్నికలు రాష్ట్రానికి చాలా కీలకం
- ఎంతో శ్రమపడి అభ్యర్థులను ఎంపిక చేశాం
- నిత్యం ప్రజల్లో వుండండి
- ఒకే విడతలో మనం 99 మంది అభ్యర్థులను ప్రకటించాం
- సిద్ధం సభలు పెడుతున్న జగన్ ఒక్క అభ్యర్థినీ ప్రకటించలేకపోయాడు
- నైరాశ్యంలో చాలా కుట్రలు చేస్తాడు
- దీటుగా ఎదుర్కోవాలి
- టిక్కెట్లు పొందిన వారికి చంద్రబాబు సందేశం



అమరావతి: రాష్ట్ర ప్రయోజనాలతో పాటు గెలుపే లక్ష్యంగా టీడీపీ అభ్యర్థుల ఎంపిక జరిగిందని, వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసమే టీడీపీ, జనసేన పొత్తులో పోటీ చేస్తున్నాయని స్పష్టం చేశారు. తొలి జాబితాలో సీట్లు పొందిన అభ్యర్థులతో చంద్రబాబు నాయుడు ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యర్థులుగా ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపి, పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. గతంలో ఎప్పుడూ ఇంత ముందుగా అభ్యర్థుల ప్రకటన జరగలేదు. పార్టీ అభ్యర్థులకు సైతం ప్రజల మద్దతు, ఆమోదం ఉండాలి అని కొత్త విధానం ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశాను. 1.3 కోట్ల మంది నుంచి అభిప్రాయాలు తీసుకున్నాను. సర్వేలు పరిశీలించి, సుదీర్ఘ కసరత్తు చేసి అభ్యర్థుల ఎంపిక చేశాను. దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ లో కూడా ఎప్పుడూ ఇటువంటి ప్రయత్నం జరగలేదు. ఇక ఇప్పుడు ఒక్క సీటూ ఓడిపోవడానికి వీలు లేదు.

- మిగతా 3లో...

43

## కౌంట్‌డౌన్ కామెంట్రీ



పొత్తుపై బ్లూ మీడియాలో కథనాలపై లోకేష్ వ్యంగ్య ట్వీట్. 'పొత్తుపై బ్లూ మీడియా ఆర్తనాదాలు శ్రవణానందంగా ఉన్నాయి. లోకేష్ ట్వీట్ పై - సైలెంటైపోయిన తాడేపల్లి గుంపు.

*జనసేన-తెదే పార్టీ*
*ఒకరికొకరు ఛారిటీ!*
*ఎడబొబ్బలు పెడబొబ్బలు*
*పెడుతున్నది -ఫ్యాను పార్టీ!!*

*పొత్తుమీద కత్తిగట్టి*
*బురద జిమ్మె.. నీలిసాక్షి!*
*అదికాస్తా అత్తరాయె*
*బాబు-పవను ఖుషీ ఖుషీ!!*

*వినసొంపుగ ఉన్నదంట*
*జగనార్తనాద -హొూరు!*
*లోకేషన్న వేసినాడు*
*వెటకారపు -షాయరు!!*

*హరోంహర కూటమింక*
*అప్రతిహత విజయాలు*
*జ.మో.రె-కు ముందున్నది*
*క్రోకడైలు -ఫెస్టివలు!!*

-మహాదేవ

## మంగళగిరిలో ఖాళీ అవుతున్న వైకాపా

# టీడీపీలో భారీగా చేరికలు

- నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన 600 వైకాపా కుటుంబాలు
- చేరిన వారిలో ముఖ్యనాయకులు, పంచాయతీ వార్డుసభ్యులు
- నియోజకవర్గ అభివృద్ధికి అంతా కలిసి పనిచేద్దామని యువనేత పిలుపు

2



## మంగళగిరి ఎయిమ్స్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ



3

## మీ సేవలను

# మరువం

- రాజకీయ భవిష్యత్‌కు నాదీ భరోసా
- రాష్ట్రం కోసమే జనసేనతో పొత్తు
- సీట్లు రాని సీనియర్లకు చంద్రబాబు బుజ్జగింపు
- అధినేతను కలిసిన గంటా, ఆలపాటి, దేవినేని, పీలా, గండి బాబ్జీ, బొడ్డు
- అధినేత మాటే శిరోధార్యమన్న నాయకులు

- వివరాలు 3వ పేజీలో..

*నేడు శ్రీకాకుళంలో*

## చంద్రబాబు రా.. కదలిరా సభ

అమరావతి: కొద్దిరోజుల విరామం అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు తిరిగి రా.. కదలిరా సభలో పాల్గొననున్నారు. ఈ నెల 26వ తేదీ, సోమవారం శ్రీకాకుళంలో జరిగే రా.. కదలిరా సభలో ఆయన పాల్గొంటారు. చంద్రబాబు, రా..కదలిరా సభల ద్వారా జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూ ఇటు జనంలో చైతన్యం తెస్తూనే, అటు పార్టీ శ్రేణులను రానున్న ఎన్నికల సమరానికి కార్యోన్ముఖులను చేస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా సోమవారం ఆయన శ్రీకాకుళంలో రా.. కదలిరా సభలో ప్రసంగించనున్నారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఉండవల్లిలోని నివాసం నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.45కి శ్రీకాకుళం చేరుకుంటారు. 3.00 గంటల నుండి సాయంత్రం 4.30 వరకు శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డు వద్ద జరిగే రా.. కదలిరా సభలో చంద్రబాబు మాట్లాడతారు. సభ అనంతరం రోడ్డు మార్గంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, 6.40 గంటలకు బయలు దేరి 7.40 గంటలకు విజయవాడ విమానాశ్రయం చేరుకుని, ఉండవల్లి లోని తన నివాసానికి వెళతారు. ఇప్పటివరకు 21 పార్లమెంటు నియోజకవర్గాల్లో రా..కదలిరా సభలు పూర్తికాగా, శ్రీకాకుళం సభ 22వది.

# మంగళగిరిలో ఖాళీ అవుతున్న వైకాపా

# టీడీపీలో భారీగా చేరికలు

- నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన 600 వైకాపా కుటుంబాలు
- చేరిన వారిలో ముఖ్యనాయకులు, పంచాయతీ వార్డుసభ్యులు
- నియోజకవర్గ అభివృద్ధికి అంతా కలిసి పనిచేద్దామని యువనేత పిలుపు



మంగళగిరి: రాష్ట్రవ్యాప్తంగా జనం తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారు. యువగళం సారధి నారా లోకేష్ పూరించిన శంఖారావంతో వైకాపా నేతలు స్వచ్ఛందంగా టీడీపీకి మద్దతు ప్రకటిస్తున్నారు. టీడీపీలో చేరేవారితో మంగళగిరి నియోజకవర్గంలో వైకాపా పూర్తిగా ఖాళీ అవుతోంది. ఉండవల్లి నివాసంలో ఆదివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో 600 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైకాపా ముఖ్యనేతలు, పంచాయతీ వార్డు సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్, వివిధ సంఘాల అధ్యక్షులు, సగర కుల పెద్దలు తెలుగుదేశం పార్టీలో చేరారు. అరాచక వైకాపా సర్కారు పని అయిపోయిందని, టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందని భరోసా ఇచ్చారు. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అందరమూ కలిసికట్టుగా పనిచేద్దామని లోకేష్ పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణం 22వ వార్డుకి చెందిన వైకాపా నేత- రాష్ట్ర సగర సంఘం కార్యదర్శి జూటూరు ఏడుకొండలు నేతృత్వంలో 21, 22వ వార్డులకి చెందిన బేతంపూడి గ్రామానికి చెందిన 75 కుటుంబాలు, జొన్నకూటి మల్లేశ్వరి ఆధ్వర్యంలో 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. తాడేపల్లి టౌన్‌కి చెందిన వైకాపా నాయకులు దారా నాని, ఎనుబ్రి నరేష్‌తోపాటు 14వ వార్డుకి చెందిన 50 కుటుంబాలు, వైకాపా నేత మేకా శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి వైకాపాకి చెందిన మాజీ సర్పంచ్ మన్నెం సుజాత- మన్నెం కిశోర్ దంపతులతోపాటు వంద కుటుంబాలకు లోకేష్ పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. మంగళగిరి మండలం నీరుకొండ గ్రామానికి చెందిన వైకాపా నేత తాడిబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యం లో 15 కుటుంబాలు, ఆత్మకూరు గ్రామానికి చెందిన బిదగ జంగాల కులపెద్దలు ఒంటెద్దు రామచంద్రయ్య -ఒంటెద్దు ఆంజనేయులు సమక్షంలో 70 కుటుంబా లు, ఎర్రబాలెం గ్రామానికి చెందిన అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మన్, వైకాపా ముఖ్యనేత పలగాని శివప్రసాద్ టీడీపీ గూటికి చేరారు. దుగ్గిరాల మండ లం చింతలపూడి వైసీపీకి చెందిన 2వవార్డు సభ్యుడు నర్రా శ్రీనివాసరావు, 7వ వార్డు సభ్యురాలు యాదల సాయిలక్ష్మితోపాటు మొత్తంగా 600 కుటుంబాలకు పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి నారా లోకేష్ ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నందంఅబద్దయ్య, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి మండల అధ్యక్షులు తోట పార్థసారథి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, దుగ్గిరాల మండల అధ్యక్షుడు కేశంనేని శ్రీఅనిత, మంగళగిరి నియోజకవర్గ ముఖ్య












## బ్లూ మీడియా ఆర్తనాదాలు

### శ్రవణానందకరంగా ఉన్నాయి

టీడీపీ-జనసేన పొత్తుపై నీలి మీడియాలో వస్తున్న కథనాలపై నారా లోకేశ్ వ్యంగ్యంగా స్పందించారు. బ్లూ మీడియా ఆర్తనాదాలు శ్రవణానందకరంగా ఉన్నాయి. బై..బై జగన్ అంటూ లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నీలి మీడియాలో వచ్చిన కథనాన్ని లోకేష్ ట్యాగ్ చేశారు.

Lokesh Nara
@naralokesh

బ్లూ మీడియా ఆర్తనాదాలు శ్రవణానందకరంగా ఉన్నాయి. బై..బై ..జగన్!
#RipBlueMedia
#DirtyJGang
#TDPJSPWinning
#ByeByeJaganIn2024

Translate post



# మీ సేవలను మరువం

- రాజకీయ భవిష్యత్‌కు నాదీ భరోసా
- రాష్ట్రం కోసమే జనసేనతో పొత్తు
- సీట్లు రాని సీనియర్లకు చంద్రబాబు బుజ్జగింపు
- అధినేతను కలిసిన గంటా, ఆలపాటి, దేవినేని, పీలా, గండి బాబ్జీ, బొడ్డు
- అధినేత మాటే శిరోధార్యమన్న నాయకులు



అమరావతి: టీడీపీ తొలిజాబితాలో సీటు కోల్పోయిన నేతలను పార్టీ అధినేత చంద్రబాబు పిలిపించి మాట్లాడారు. రాజకీయ భవిష్యత్‌పై అధినేత భరోసా ఇచ్చారని, ఆయన మాటే శిరోధార్యమని భేటీ అనంతరం ఆయా నాయకులు చెప్పారు. జనసేనతో పొత్తులో భాగంగా సీట్లు కోల్పోయిన సీనియర్లను టీడీపీ అధినేత చంద్రబాబు బుజ్జగిస్తున్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్ కోసమే జనసేనతో పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందని నేతలకు విడమరిచి చెబుతున్నారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని, విధ్వంసకారుడు జగన్ పాలనలో నాశనమవుతున్న రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే పొత్తులని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొందరు నేతలు త్యాగాలకు సిద్ధపడాల్సిందేనని అంటున్నారు. అయితే ఇన్నాళ్లా పార్టీకి ఆయా నేతలుచేసిన సేవలను, పడిన కష్టాన్ని విస్మరించబోమని స్పష్టం చేస్తున్నారు. సీట్లు కోల్పోయిన నాయకుల రాజకీయ భవిష్యత్‌కు హామీ ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో సీటు దక్కించుకున్న వారితో, జనసేన నేతలతో సమన్వయంతో పనిచేయాలని ఆయా నేతలకు సూచిస్తున్నారు. ఆదివారం ఉండవల్లిలోని నివాసానికి కొంత మంది నేతలను చంద్రబాబు పిలిపించారు. మాజీ మంత్రులు ఆలపాటి రాజా, దేవినేని ఉమా, గంటా శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద్, గండి బాబ్జీ, రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ ఉండవల్లిలో చంద్రబాబును కలిశారు. సీనియర్లకు టికెట్‌ను ఎందుకు ఇవ్వలేకపోతున్నామన్న విషయాన్ని నేతలకు సమగ్రంగా చంద్రబాబు వివరించారు. కొంత మంది సీనియర్లకు నియోజకవర్గాన్ని ఎందుకు మార్చాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నది సంబంధిత నాయకులకు చంద్రబాబు తెలియజేశారు. పొత్తుల్లో భాగంగా కొన్ని చోట్ల సీనియర్లు త్యాగాలు చేయకతప్పదని చంద్రబాబు నేతలతో చెప్పారు. చంద్రబాబుతో భేటీ అనంతరం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధినేత హామీతో ఆయా నేతలు సంతృప్తి చెందారు.

తెనాలి నుంచి టీడీపీ టికెట్‌ను మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆశించారు. అయితే తెనాలి స్థానం జనసేన నేత నాదెండ్ల మనోహర్‌కు కేటాయించటంతో రాజా కొంత నిరాశకు గురయ్యారు. ఆయనను బుజ్జగించేందుకు ఉండవల్లిలోని తన నివాసానికి చంద్రబాబు పిలిపించారు. దాంతో ఆలపాటి రాజా ఆదివారం చంద్రబాబు నివాసానికి వచ్చారు. సుమారు రెండు గంటల పాటు అధినేతతో రాజా చర్చించారు. చంద్రబాబుతో భేటీ అత్యంత సంతృప్తికరంగా ముగిసిందని రాజా తెలిపారు. పొత్తుల్లో భాగంగానే తెనాలి సీటు జనసేనకు కేటాయించాల్సి వచ్చిందని వివరించారు. పొత్తుల్లో తన సీటును జనసేనకు సర్దుబాటు చేయాల్సి వచ్చిందని చంద్రబాబు తనతో చెప్పారని అన్నారు. నాదెండ్ల మనోహర్‌తో సమన్వయం చేసుకుని రాబోయే ఎన్నికల్లో ముందుకెళ్లాలని చంద్రబాబు సూచించారని ఆలపాటి రాజా తెలిపారు. తన రాజకీయ భవిష్యత్‌పై అధినేత హామీ ఇచ్చారని చెప్పారు.

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా చంద్రబాబు నివాసానికి వచ్చి కలిశారు. గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గంటా గెలుపొందారు. టీడీపీ ప్రకటించిన తొలిజాబితాలో ఆయనకు చోటు దక్కలేదు. ఆయనను చీపురుపల్లి నుంచి బరిలోకి దింపే యోచనలో టీడీపీ ఉంది. మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీకి గంటా ధీటైన అభ్యర్థి అవుతారని చంద్రబాబు భావిస్తున్నారు. చీపురుపల్లి నుంచి పోటీ చేయమని చంద్రబాబు సూచించారని భేటీ అనంతరం గంటా చెప్పారు. భీమిలి నుంచి పోటీ చేస్తానని చెప్పగా, నువ్వెక్కడ పోటీ చేసినా గెలుస్తావని చంద్రబాబు అన్నారు. ఎక్కడ పోటీ చేయించే విషయాన్ని తనకు వదిలిపెట్టాలని చంద్రబాబు అన్నారు. టీడీపీ తొలిజాబితాపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని గంటా అన్నారు. మొదటి జాబితాపై ప్రజా స్పందన బాగుందని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత నిజమో..వైసీపీ ఓడటం అంతే నిజమని గంటా అన్నారు.

తొలిజాబితాలో దేవినేని ఉమామహేశ్వరరావు పేరు లేకపోవడంపై ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా టీడీపీ నేతల్లో ప్రధానమైన చర్చ జరుగుతోంది. దీనిపై ఆయన కూడా చంద్రబాబును కలిసి మాట్లాడారు. దాదాపు గంటకు పైగా వీరి భేటీ సాగింది. కొన్ని సమీకరణాల్లో భాగంగానే మొదటి జాబితాలో సీటు ప్రకటించలేకపోయినట్లు చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది. భేటీ అనంతరం దేవినేని ఉమా మాట్లాడుతూ నేను చంద్రబాబు కుటుంబ సభ్యుడిని, ఆయన మాటే తనకు శిరోధార్యమన్నారు.

అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ కూడా చంద్రబాబును కలిశారు. ఈ స్థానం పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వటంతో ఆ పార్టీ అభ్యర్థిగా కొణతాల రామకృష్ణను ప్రకటించారు. దీంతో అసంతృప్తికి గురైన పీలా గోవింద్‌ను చంద్రబాబు పిలిపించి మాట్లాడారు. న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా పీలా చెప్పారు. తొలి జాబితాలో సీటు ప్రకటించని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీకూడా చంద్రబాబు ను కలిశారు.

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం టీడీపీ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి కూడా చంద్రబాబుతో భేటీ అయ్యారు. అయితే ఆ సీటును పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. అక్కడ జనసేన అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణను పవన్‌ప్రకటించారు.దీంతో బొడ్డును చంద్రబాబు పిలిపించుకుని మాట్లాడారు. రాజకీయ భవిష్యత్తుపై హామీ ఇచ్చారు. రాజమండ్రి ఎంపీ స్థానం, కుదరకపోతే ఇతర ప్రత్యామ్నాయాలు చూస్తానని అధినేత చెప్పారని బొడ్డు తెలిపారు. చంద్రబాబుతో సమావేశం తర్వాత బొడ్డు వెంకటరమణ సంతృప్తి వ్యక్తం చేశారు.

పెనుకొండ ఇన్‌ఛార్జ్ పార్థసారధి, మరికొందరు నేతలు సోమవారం వచ్చి అధినేతను కలవనున్నారు. సీట్లు దక్కని చంద్రబాబు ఒక్కొక్కరిని పిలిచి మాట్లాడుతున్నారు.

## మంగళగిరి ఎయిమ్స్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ



ఢిల్లీ: మంగళగిరిలో నిర్మించిన ఆలిండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం. వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థను జాతికి అంకితం చేశారు. మంగళగిరి ఎయిమ్స్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, భారతి ప్రవీణ్, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 5 ఎయిమ్స్‌ను ప్రధాని మోదీ ఏకకాలంలో ప్రారంభించారు. మంగళగిరి ఎయిమ్స్ తో పాటు రాజ్ కోట్ (గుజరాత్), భటిండా (పంజాబ్), రాయ్ బరేలీ (ఉత్తరప్రదేశ్), కల్యాణి (పశ్చిమ బెంగాల్) ఎయిమ్స్‌లను కూడా మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన 50ఏళ్ల పాటు దేశంలో ఒకే ఒక ఎయిమ్స్ ఉండేదని, అది కూడా ఢిల్లీలో ఉండేదని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 7 దశాబ్దాలకు 7 ఎయిమ్స్ లకు ఆమోదం లభిస్తే, అవీ పూర్తి కాలేదన్నారు. అయితే, ఇప్పుడు కేవలం 10 రోజుల్లోనే 7 కొత్త ఎయిమ్స్ ను ప్రారంభించడమో, లేదా శంకుస్థాపన చేయడమో జరిగిందని, దీన్నిబట్టి గత ఆరేడు దశాబ్దాలతో పోల్చితే ఇప్పుడు దేశాభివృద్ధి వేగం పుంజుకుందని వివరించారు.

## ప్రతి సీటు గెలవాలి...
## అందరినీ కలుపుకొని సాగండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నికలు రాష్ట్రానికి, రాష్ట్ర భవిష్యత్ కు ఎంతో కీలకం. ఏ స్థాయిలో కూడా చిన్న తప్పు, పొరపాటు జరగకూడదు. నిత్యం ప్రజల్లో ఉండండి. ప్రజలకు భవిష్యత్ పై నమ్మకం, ధైర్యం కలిగేలా నాయకత్వం అందించండి అని చంద్రబాబు సూచించారు. సీట్లు ప్రకటించిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలో కష్టపడి పనిచేయాలని సూచించారు.

టికెట్లు వచ్చేశాయనే నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. వచ్చే 40 రోజులు అత్యంత కీలకమన్న చంద్రబాబు... ప్రభుత్వ విధానాలతో పాటు స్థానిక ఎమ్మెల్యేల పనితీరును ఎండగట్టేలా కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు.

జనసేన కేడర్‌తోనూ సమన్వయం చేసుకుంటూ ఎన్నికలకు వెళ్లాలని పిలుపునిచ్చారు. 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం తెదేపా-జనసేన పొత్తులో పోటీ చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే ప్రధానంగా, గెలుపే లక్ష్యంగా పార్టీ అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. గతంలో ఎప్పుడూ ఇంత ముందుగా అభ్యర్థుల ప్రకటన జరగలేదని గుర్తు చేశారు.

### జగన్ అహంకారమే అతని పతనానికి నాంది

ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించాం.....ఇప్పుడు 99 చోట్ల ఉమ్మడి అభ్యర్థులనూ ప్రకటించాం. జగన్ అహంకారంతో చేసిన విధ్వంసం అతని పతనానికి నాంది కాబోతోంది. చరిత్రలో చూడని విధ్వంస పాలకుడైన జగన్ ను ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారు. ప్రజలతో ఓట్లు వేయించుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. జగన్ ఎన్నికలకు సిద్ధంగా లేడు....సిద్ధం అని సభలు పెడుతున్న జగన్ అభ్యర్థులను మాత్రం ప్రకటించలేకపోయాడు. సీట్లు ఇచ్చేశారు. ప్రజల్లోనూ ప్రభుత్వ వ్యతిరేకత ఉంది కదా అని ఏ ఒక్కరూ ఎన్నికలను సులభంగా తీసుకోవద్దు. ఎంత సీనియర్ నేత అయినా...నియోజకవర్గంలో ఎన్ని సానుకూల అంశాలు ఉన్నా చివరి నిముషం వరకు ప్రజల్లో ఉండి కష్టపడాలి. నియోజకవర్గంలో అసంతృప్తితో ఉన్న నాయకులు, కార్యకర్తలను మీరు కలుపుకుని పోవాలి. ఎవరైనా అసంతృప్తితో ఉంటే ఒకటికి పదిసార్లు స్వయంగా వెళ్లి మీరే కలవాలి....నేనే అభ్యర్థి కదా అని ఈగోతో వ్యవహరిస్తే కుదరదు. తటస్థులను కలవండి...రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని వివరించి అన్ని వర్గాల మద్దతు కోరండి అని చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.

### కుట్రలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి

జనసేన మన మిత్ర పక్షం. జనసేన నేతలను కలుపుకుపోవాలి...గౌరవించాలి. అలాగే జనసేన వాళ్లు మీతో కలిసి ప్రయాణం చేయాలి. రెండు పార్టీల నేతలు సమన్వయంతో పనిచేస్తే 100 శాతం ఓట్ల బదిలీ జరుగుతుంది. 5 ఏళ్ల పాలనపై గ్రామాల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు కూడా అసంతృప్తితో ఉన్నారు. ఆ పార్టీలో మంచి వారు పార్టీలోకి వస్తే ఆహ్వానించండి. జగన్ ఎన్నికల్లో గెలుపునకు తన పాలనను నమ్ముకోలేదు....దౌర్జన్యాలు, అక్రమాలు, దొంగ ఓట్లు, డబ్బును నమ్ముకున్నాడు. ప్రచార విభాగాన్ని బలోపేతం చేసుకోండి....ప్రతి అభ్యర్థి ఒక న్యాయవాదిని పెట్టుకోండి. మనం ఊహించని స్థాయిలో జగన్ కుట్రలు కుతంత్రాలు చేస్తాడు...అన్నింటికీ మీరు సిద్ధంగా ఉండాలి." అని చంద్రబాబు అన్నారు. సీట్లు పొందిన నేతలకు ఆల్ ది బెస్ట్ చెప్పి వెంటనే ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.

# టెక్కలిలో వైసీపీకి భారీ గండి

### -టీడీపీలో చేరిన 500 కుటుంబాలు
### -అచ్చెన్నకు జై కొట్టిన జనం

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలో వందలాది కుటుంబాలు టీడీపీలో చేరాయి. నియోజకవర్గ కేంద్రమైన టెక్కలి పట్టణం నుండి దాదాపు 12 వీధుల నుండి 500 కుటుంబాలు కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్ భవన్ లో రాష్ట్ర టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో 500 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్కలి పట్టణంలో జరిగిన అభివృద్ధి కేవలం తెదేపా ప్రభుత్వంలో అచ్చెన్నాయుడు చేసిందే తప్ప వైకాపా ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. టెక్కలిలో మళ్లీ అచ్చెన్నాయుడునే అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నియోజకవర్గ తెదేపా నాయకులు, తెలుగుయువత నాయకులు, ఐటీడీపీ సభ్యులు, తెలుగుమహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.







## ఓటమి ఖాయమని తెలిసే
# వైకాపా నేతల అడ్డగోలు మాటలు

- మా పొత్తులపై మీకు ఉలుకెందుకు?
- కాపులపై అంబటిది కపట ప్రేమ
- టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా ధ్వజం

అమరావతి: తెలుగుదేశం - జనసేన కూటమి ఉమ్మడిగా 99సీట్లు ప్రకటించగానే వైకాపాకు దిమ్మ తిరిగి పోయిందని టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా అన్నారు. తొలి జాబితాతో తాడేపల్లి ప్యాలెస్ వణికిపోయిందన్నారు.ఆదివారం మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాగుల్‌మీరా మాట్లాడుతూ వైకాపా ఓటమి అంచున ఉందనే విషయం ఆ పార్టీ నాయకుల మాటలను బట్టే స్పష్టమవుతోందన్నారు. వై నాట్ 175 అన్న జగన్‌రెడ్డికి టీడీపీ-జనసేన అభ్యర్థుల జాబితా ప్రకటించడంతో భయం పట్టుకుంది. ప్రజలు జగన్‌రెడ్డిని తిరస్కరిస్తున్నారని వైకాపా నాయకులకు అర్థమయింది. చంద్రబాబు నాయుడు - పవన్‌కళ్యాణ్ కలయికతో వైకాపా ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందనే భయంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారో ఆయనే ప్రకటిస్తారు. దీనిపై వైకాపా నాయకులకు ఎందుకంత ఆసక్తి?. జగన్‌రెడ్డి ఎక్కడ నుంచి పోటీ చేస్తారో ఎందుకు చెప్పడం లేదు?. జగన్‌రెడ్డి నెలరోజులకు పైగా జాబితాలపై కసరత్తులు చేసినప్పటికీ అధికారికంగా ఒక్క అభ్యర్థినీ ప్రకటించలేకపోయాడు. జగన్‌రెడ్డి నియమించిన సమన్వయకర్తల్లో కూడా ఎవరు ఉంటారో.. ఎవరు ఊడతారో తెలియని అభద్రతాభావంలో ఉన్నారు. ఎవరు ఉంటారో, ఎవరు ఊడుతారోనని ఎమ్మెల్యేలకు ఎంపీ సీట్లు ఇస్తామంటే వద్దంటున్నారు. ఎంపీలకు ఎమ్మెల్యే సీట్లు ఇస్తామంటే కాదంటున్నారు. వైకాపాకు అభ్యర్థులు దొరక్క చిత్తూరు నుంచి తీసుకొచ్చి ఒంగోలులో పోటీకి దింపుతున్నారు, మరొకాయనను నెల్లూరు నుంచి నరసారావుపేటకు తెచ్చారు. ఇలా వైకాపా నాయకులను రెండు, మూడు జిల్లాలు దాటించాల్సిన గతి వైకాపాకు ఎందుకు పట్టింది? వైకాపా తరపున పోటీ చేయడానికి అభ్యర్థులు లేరనడానికి ఇది సాక్ష్యం కాదా? అలాంటిది టీడీపీ-జనసేన కూటమి 99 మందిని ఒకేసారి ప్రకటించడం సంచలనం కాదా అని నాగుల్‌మీరా ప్రశ్నించారు.

### అంబటికి నైతిక హక్కు లేదు

టీడీపీ-జనసేన పొత్తు గురించి జగన్‌రెడ్డి మాట్లాడుతూ సింహం సింగిల్‌గా వస్తుందని అంటున్నారు. సింహం సింగిల్‌గా రాదని జగన్‌రెడ్డి తెలుసుకోవాలి. జగన్‌రెడ్డి దుర్మార్గ, అరాచక పాలనలో అణిచివేతకు గురైన దళితులు, బీసీలు, మైనారిటీలు, గిరిజనులు.. తెలుగుదేశం-జనసేన సంకీర్ణ ప్రభుత్వంలోనే తమకు రక్షణ ఉంటుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి నియంతృత్వ పాలనను అన్ని పార్టీలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి.సొంతచెల్లి విమర్శలకు జగన్‌రెడ్డి సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నాడు. నోటికొచ్చినట్లు మాట్లాడుతన్న అంబటి రాంబాబుకు అసలు సీటు ఉంటుందా? కాపులపై అంబటి దొంగ ప్రేమ వలకబోస్తున్నారు. అంబటి రాంబాబుకు కాపుల గురించి మాట్లాడే నైతిక హక్కులేదు. వైసీపీలో కాపు నాయకులు పాత్ర ఏమిటి? కాపు కార్పొరేషన్‌కు వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తానన్న జగన్‌రెడ్డి కనీసం వంద కోట్లు కూడా ఇవ్వలేదు. దీనిపై వైకాపా కాపు నాయకులు ఎందుకు మాట్లాడలేదు?. పవన్‌కళ్యాణపై జగన్ వ్యక్తిగత దూషణలు చేస్తే వైసీపీ కాపునాయకులు ఎప్పుడైనా మాట్లాడారా? రాయలసీమలో సాంప్రదాయకంగా బలిజల సీటు అయిన రాజంపేట ఎంపీ స్థానాన్ని మిథున్‌రెడ్డికి ఇస్తే ఎందుకు మాట్లాడలేదు? వైకాపాలో సీట్లు వస్తాయో లేదో అన్న సందేహం ఉన్న వారే అతిగా మాట్లాడుతున్నారు.అందరి అభిప్రాయాలు తీసుకుని అందరికీ అనుకూలమైన 99 మంది అభ్యర్థులను చంద్రబాబు నాయుడు ఒకేసారి ప్రకటిస్తే వైకాపా నాయకులకు ఉలుకెందుకు. రాష్ట్రంలో ప్రజల జీవితాలు బాగుపడాలంటే.. జగన్‌రెడ్డి అక్రమ దోపిడీని ఆపాలంటే, అప్పుల



ఊబిలో కూరుకు పోయిన రాష్ట్రాన్ని కాపాడాలంటే.. తెలుగుదేశం-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. చంద్రబాబు లాంటి అనుభవం ఉన్నటువంటి వ్యక్తి రాష్ట్రానికి అవసరం ఉందని అందరూ భావిస్తున్నారని నాగుల్‌మీరా అన్నారు.

### టీడీపీతోనే సామాజిక న్యాయం

సామాజిక న్యాయానికి పేటెంట్ తెలుగుదేశం పార్టీదే. సామాజిక న్యాయానికి పునాది వేసింది ఎన్టీఆర్ అయితే.. దాన్ని ఆచరణలో పెట్టింది చంద్రబాబు నాయుడు. దళితులకు, బడుగు,బలహీనవర్గాలకు తాడేపల్లి ప్యాలెస్ గేటు కూడా తెరుచుకోదని అందరికీ తెలిసిపోయింది. బలహీన వర్గాలకు జగన్‌రెడ్డి పాలనలో తీవ్ర అన్యాయం జరిగింది. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశానని చెబుతున్న జగన్‌రెడ్డి.. వాటికి ఒక్క రూపాయి అయినా నిధులు ఇచ్చారా? మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు సైతం ఒక్క రూపాయి లోను ఇవ్వలేదు. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం పెట్టడం కాదు..ఆ మహానుభావుడి ఆశయాలను అమలు చేయాలి. దళిత వర్గాల సంక్షేమానికి సంబంధించిన 27 పథకాలను జగన్ రద్దుచేశాడు. రూ.33వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించాడు. అంబేద్కర్ పేరున ఉన్న విదేశీ విద్య పథకానికి ఆ మహనీయుని పేరు తొలగించి జగన్ పేరు పెట్టుకున్న నాడే జగన్ మోసాన్ని దళితులు తెలుసుకున్నారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరచకపోతే.. జగన్‌రెడ్డి లాంటి నియంత దళితులకు సీట్లు కూడా ఇవ్వడు. విజయవాడ చరిత్రలో ఓసీ ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో దళితుడైన బీఎస్ జయరాజుకు అవకాశం కల్పించింది తెలుగుదేశం పార్టీ. అది సామాజిక న్యాయం పట్ల తెలుగుదేశంకు ఉన్న చిత్తశుద్ధి అని నాగుల్‌మీరా అన్నారు.

### జగన్‌ను ఇంటికి పంపటం ఖాయం

తెలుగుదేశం-జనసేన పొత్తు, సీట్లు గురించి మేం చూసుకుంటాం. వైకాపా నాయకులు వారి సీట్లు గురించి ఆలోచించుకుంటే మంచిది. అంతేకానీ, మేం అభ్యర్థులను ప్రకటిస్తే మీ కెందుకు ఉలుకు. జగన్ రెడ్డిది దాదుల ప్రభుత్వం తప్ప అభివృద్ధి ప్రభుత్వం కాదు. ఉత్తరాంధ్రకు సుబ్బారెడ్డి, గోదావరి జిల్లాలకు మిథున్ రెడ్డి, కృష్ణా, గుంటూరులకు అయోధ్య రామిరెడ్డి, రాయలసీమకు పెద్దిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలను బాధ్యులుగా నియమించి జగన్‌రెడ్డి పాలన చేస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఐదు విభాగాలుగా విభజించి జగన్‌రెడ్డి తన సొంత కులానికి చెందిన ఐదుగురు సామంత రాజులను నియమించుకున్నాడు. అచ్చెన్నాయుడు,యనమల రామకృష్ణుడు, షరీఫ్ లాంటి బీసీ, మైనారిటీ నాయకులకు చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చేవారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలు జగన్‌రెడ్డిని ఇంటికి పంపడం ఖాయమనే విషయాన్ని వైకాపా నాయకులు గుర్తించుకోవాలని నాగుల్‌మీరా స్పష్టం చేశారు.

# ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తే ఉపేక్షించేది లేదు: బొండా ఉమ

విజయవాడ, చైతన్య రథం: అజిత్ సింగ్ నగర్‌లోని వాంబే కాలనీ రోడ్డులో గల ముస్లిం ఖబరస్థాన్‌ను అభివృద్ధి పేరుతో ముస్లింలకు సంబంధించిన సమాధులను లారీలు, ప్రొక్లెంలు, ట్రోజర్లతో పగలగొట్టి నేల మట్టం చేయడంపై తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, సెంట్రల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ధ్వంసం చేసిన ఖబరస్థాన్‌ను సందర్శించారు.

ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌ఛార్జిగా వచ్చినటువంటి చందాల శ్రీను అలియాస్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఇక్కడ ముస్లింగా పుట్టి ఆ మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ పదవి పొందిన రూహుల్లా ఈరోజు ముస్లిం ఖబరస్థాన్నే కబ్జా చేయడానికి సిద్ధమయ్యారు అంటే ఈ వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ఎంత దుర్మార్గానికి వడి కడుతున్నారో ప్రజలకు అర్థమవుతుందన్నారు.



ముస్లింలకు అత్యంత పవిత్ర స్థలాలైన మక్కా మరియు మసీదులు ఆ తర్వాత ఖబరుస్తాన్ అని, అలాంటి ఖబరిస్తాన్‌ను మనుషులతో కాకుండా పెద్ద పెద్ద బుల్డోజర్‌తో పెద్దల సమాధులను కూల్చడం హేయమని విమర్శించారు. ఈరోజు ముస్లిం మైనారిటీలకు పెద్దల పండగ అని, పెద్దల సమాధులకు పూజలు చేద్దామని వచ్చిన ముస్లింలు ఇది చూసి విస్తుపోయి తనను ఆశ్రయించారని తెలిపారు. ఈ చర్యలకు ఎవరైతే పాల్పడ్డారో వారు తప్పకుండా తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. అధికార పార్టీలో ఉన్నామని బరియల్ గ్రౌండ్ అభివృద్ధి పేరుతో ఇటువంటి పనికి మాలిన చేష్టలు చేసి ముస్లింల మనోభావాలు దెబ్బ తినే విధంగా చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బరియల్ గ్రౌండ్ అభివృద్ధి చేసేటప్పుడు సంబంధిత ముస్లిం మత గురువులను కానీ,ముస్లిం మతపండితులను గాని సంప్రదించారా, వారి సూచనలు సలహాలు అధికార పార్టీకి సంబంధించిన వారు కానీ లేక సంబంధిత అధికారులు కానీ తీసుకున్నారా అని అడిగారు. తాము కూడా అభివృద్ధి కాముకులమేనని, అయితే అభివృద్ధి పేరుతో ముస్లింల సంప్రదాయాలను మంటగలిపితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని బొండా ఉమ హెచ్చరించారు.

## రాష్ట్రాన్ని సైకో బారి నుండి కాపాడాలి

*అంకమ్మతల్లికి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ*



రాజుపాలెం, చైతన్యరథం: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం రాజుపాలెం గ్రామంలో శ్రీ అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గం అభ్యర్థి కన్నా లక్ష్మీ నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రాష్ట్రాన్ని సైకో భారీ నుంచి కాపాడాలని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన కూటమి ప్రభుత్వం రావాలని అమ్మవారిని కోరుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదం వితరణ చేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు మండల నాయకులు జనసేన పార్టీ మండల నాయకులు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీకి న్యాయవాదుల సూచనలు, సలహాలు అవసరం

*ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఇన్‌ఛార్జ్ నూకసాని బాలాజీ*



ఒంగోలు, చైతన్యరథం: ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ న్యాయ విభాగము సమావేశము ఒంగోలు తెలుగుదేశం పార్లమెంటరీ కార్యాలయము నందు ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ఒంగోలు పార్లమెంటరీ న్యాయవిభాగం అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు అధ్యక్షతన వహించారు. ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ, ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు డా.నూకసాని బాలాజీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి న్యాయవాదులు అందరూ తగిన సలహాలు, సూచనలు ఇస్తూ పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపినిచ్చారు. అదేవిధంగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన న్యాయవాదులను గుర్తించి వారికి పార్టీలో సముచిత స్థానాన్ని కల్పిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ సమావేశములో జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు, ఉపాధ్యక్షులు పెండ్యాల శివహరి, ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ వలి, అధికార ప్రతినిధి షేక్ షబ్బీర్, కార్య నిర్వాహక కార్యదర్శి కొత్తగొర్ల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు కే బెంజిబాబు, బత్తుల మురళీకృష్ణ, మన్నెం సురేష్‌కుమార్,ఒంగోలు నియోజవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు గోనుగుంట్ల శ్రీకాంత్, యర్రగొండపాలెం నియోజకవర్గం లీగల్ సెల్ అధ్యక్షులు డిసిహెచ్ హనుమానాయక్, మార్కాపురం నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు మన్నెం సత్యనారాయణ, కొండేపి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు వి.మారుతి ప్రసాద్, కనిగిరి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు ఆర్.సుభాష్ చంద్రబోస్, జిల్లా లీగల్ సెల్ మీడియా కోఆర్డినేటర్ నల్లూరి అవినాష్, ఉదత రవికుమార్, బొడ్డు భాస్కర్, కాంద్రా నరసింహారావు, పరిటాల సురేష్, ఎం.ప్రేమ లీలావతి, బి.వెంకటేశ్వర్లు, జే.రాజు, మోరు బోయిన వంశీ, పోకూరి కోటయ్య, ఓలేటి వెంకటేశ్వరరావు, స్వర్ణ రవీంద్రబాబు, జి.శ్రీనివాసరావు, ఎస్.మాలకొండరెడ్డి, షేక్.నాయబ్ రసూల్, ఏ.రవిచంద్ర, గల్లా గోవిందు, పి.సుబ్బారావు, వై.బాలనారాయణ, జి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## నాయకుడిగా కాదు సేవకుడిగా పనిచేస్తా: భూపేష్‌రెడ్డి



జమ్మలమడుగు, చైతన్యరథం: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని జమ్మలమడుగు తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి 18వ వార్డులో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వివరించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ మీకు నాయకుడిగా కాకుండా సేవకుడిగా పని చేస్తానన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి పేద మధ్యతరగతి వారిని నిరుద్యోగులను తీవ్ర ఇబ్బందిపాలు చేశారన్నారు. ఇంటి పన్ను, కరెంటు చార్జీలు, బస్సుచార్జీలు,పెంచారన్నారు. స్టీల్ ఫ్యాక్టరీ కట్టకుండా నిరుద్యోగులకు మోసం చేశారన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతూ ఉంటే వారందరికీ ఒక్కొక్కరికి 15000 ఇస్తారన్నారు. ఆడబిడ్డ నిధి ద్వారా 18 ఏళ్ల నుండిన ప్రతి మహిళకి నెలకు 1500 రూపాయలు ఇస్తారన్నారు. దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబుని ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్, బాల పుల్లారెడ్డి, జగదీష్, గ్రంధి శీను, దాదాపీర్, నాగార్జున్, మదర్ వలి, పవన్, సుధీర్, ఫరాజ్, పతంగి హేమంత్, మస్తాన్, ఏకోబరావు, కలందర్, షామీర్, వినయ్, షబ్బీర్, సాదక్, అనిఫ్, భాగ్యమ్మ జమ్మలమడుగు నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానుల పాల్గొన్నారు.

## వైసీపీ నుండి టీడీపీలోకి చేరికలు



పాలకొండ, చైతన్యరథం: సీతంపేట మండలం కేపీ ఈతమానుగూడ గ్రామానికి చెందిన వైయస్సార్ పార్టీకి సవర చంద్రయ్య,సవర మంగయ్య, సవర కూర్మారావు, సవర చిన్నారావు, సవర ఈశ్వరరావు, సవర గోపాలరావు, సవర మంగయ్య, సవర మజ్జయ్య, సవర చంద్రమ్మ, సవర సుశీల,సవర బంగారమ్మ, చెందిన 70 కుటుంబాల నాయకులు కార్యకర్తలు పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిని తెలుగుదేశం పార్టీ కండవా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీతంపేట మండల పార్టీ అధ్యక్షులు సవర తోట మొఖలింగం, సీనియర్ నాయుకులు నిమ్మక నాగేశ్వరరావు, పాలక ఆదినారాయణ, ఐటీడీపీ కోఆర్డినేటర్ ఈమరక పవన్, తెలుగు యువత అధ్యక్షులు సవర సంతోష్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నిమ్మక చంద్రశేఖర్, సింహాద్రి మరియు మండల గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ-జనసేన ప్రభుత్వంలోనే దళితుల అభివృద్ధి: ఎంఎస్ బేగ్



విజయవాడ, చైతన్యరథం: రాష్ట్రం బాగుండాలంటే, రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని ఆదివారం నాడు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జ్ ఎంఎస్ బేగ్ పెజ్జోనిపేట, పప్పులమిల్లు రోడ్‌లో గల ఆర్‌సిఎం చర్చి నందు ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో మంచి పరిపాలన, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రావాలని ప్రజలు కోరుకుంటున్నారు, అది తెలుగుదేశం - జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఉన్నారు. దళిత సామజికవర్గానికి చెందిన నాయకులు మీద కేసులు పెట్టించి, దళిత సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్‌ని వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించింది ఈ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అని అన్నారు నా ఎస్సీలు, నా దళితులు అన్న జగన్మోహన్‌రెడ్డి, అసలు దళితులకు ఎక్కడ ప్రాధాన్యత ఇచ్చాడని ప్రశ్నించారు. దాడులు జరిగినప్పుడు ఎప్పుడు స్పందించారని అడిగారు. అంబేద్కర్ గారి ఆశయాలను జగన్‌రెడ్డి పూర్తిగా నేలమట్టం చేశారని, ఈ రోజున ఆంధ్రరాష్ట్రంలో దళితులందరూ వెనుకబడి ఉన్నారంటే కారణం వైఎస్ జగన్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. జగన్మోహనరెడ్డి బుద్ధిచెప్పడానికి దళిత సోదరులు సిద్ధంగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో ఏర్పడబోయే తెలుగుదేశం - జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వంలో దళితులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ, క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్చార్జులు, మహిళా, యువత, అనుబంధ సంఘాలు, జిల్లా రాష్ట్ర వివిధ హోదాల్లో ఉన్న నాయకులు మరియు టీమ్ టీడీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి

- పల్లె రఘునాథ్‌రెడ్డి



పుట్టపర్తి, చైతన్యరథం: జగన్‌పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, రాష్ట్ర అభివృద్ధి సర్వనాశనమైందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లమాడ మండలం కురుమాల పంచాయతీలోని కురుమాల, గంగాపురం,చౌటకుంటపల్లి గ్రామాల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెకు మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోలోని ఆరు పథకాలను ప్రజలకు వివరించారు.

## కాపులకు జగన్ చేస్తున్న ద్రోహంపై మాట్లాడరే?

- వైసీపీ కాపు నేతలకు మాజీ ఎమ్మెల్యే కూన సూటిప్రశ్న



అమరావతి:జగన్‌రెడ్డి రాష్ట్రానికి ఏదో న్యాయం చేస్తాడని అనుకోవటం ఎండమావిలో నీళ్లున్నట్లుగా భ్రమించడమేనని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై వైసీపీ నాయకులతో పాటు ముఖ్యమంత్రి కూడా వ్యక్తిగత విమర్శలు చేస్తుంటే ఆ పార్టీలోని కాపు నాయకులు ఎందుకు ఖండించరని ఒక ప్రకటనలో కూన నిలదీశారు. కాపు సామాజికవర్గంపై ఏమాత్రం చిత్తశుద్ధిలేని వైకాపా కాపు నాయకులు.. జగన్‌రెడ్డి ఆదేశాలతో పవన్‌కళ్యాణ్‌పై మాత్రం వ్యక్తిగత దూషణలకు దిగుతారా? రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన కూటమి 170సీట్లతో అఖండ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది. వైసీపీ సింగల్ డిజిట్‌కే పరిమితం కాబోతోంది. జగన్‌మోహన్‌రెడ్డిని ఎప్పుడు ఇంటికి సాగనంపుదామా, జగనాసురుడి రాక్షస పాలనకు ఎప్పుడు అంతం పలుకుదామా అని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల, కులాల, మతాల ప్రజలు రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నారు. తెలుగుదేశం-జనసేన పొత్తు రెండు పార్టీల కోసం కాదు. ఈ కూటమి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కోసం. రాష్ట్రాభివృద్ధి కోసం. నిరుద్యోగుల భవిష్యత్తు కోసం. తెలుగుదేశం-జనసేన ఏకతాటిపైకి వచ్చి ఎన్నికల్లో పోటీచేస్తే వైకాపాకు ఉలుకెందుకు. 99 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో వైకాపాకు నిద్రపట్టడం లేదు. రాబోయే రోజుల్లో మిగిలిన స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటిస్తాం. తెలుగుదేశం-జనసేన పొత్తుతోనే వైకాపా ఎప్పుడో కాడి వదిలేసింది. జగన్ మోహన్‌రెడ్డి వైనాట్ 175 అంటున్నాడు. మేము వైనాట్ పులివెందుల అనే నినాదంతో ప్రజల వద్దకు రాబోతున్నామని కూన స్పష్టం చేశారు.

### కాపులకు అన్యాయం జరిగితే అంబటి, పేర్ని ఎందుకు నోరు మెదపలేదు

- డా.సునీల్‌కుమార్



మడకశిర, చైతన్యరథం: కాపు రిజర్వేషన్ క్యాన్సిల్ చేసినప్పుడు అంబటి రాంబాబు,పేర్ని నాని ఎక్కడికి వెళ్లారు గాడిదలు కాస్తున్నారా అని మడకశిర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ ప్రశ్నించారు.స్వాతంత్ర కాలం నుండి రాజంపేట సీటు కాపులకు ఇచ్చారని, వైఎస్ఆర్సిపి వచ్చాక మిథున్‌రెడ్డికి కేటాయిస్తే వీళ్ళందరూ ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. టీడీపీ-జనసేన తొలిజాబితాలో దళితులకు అత్యధిక ప్రాధాన్యత కల్పించి సామాజికన్యాయం కల్పించారన్నారు. వైసీపీ నేతలు పొత్తుపై అవాక్కులు చవాక్కులు పేలుతున్నారని, కోటి 3 లక్షల 33వేల ప్రజాభిప్రాయ సేకరణ మేరకే అభ్యర్థులను ఖరారు చేశారనిచెప్పారు.ఈకార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు శివాజీ, మాజీ ఎంపీపీ అశ్వతమప్ప, మాజీ మండల్ కన్వీనర్ రామాంజనేయులు,తాలూకా రైతుసంఘం అధ్యక్షులు రాజగోపాల్, కృష్ణప్ప, మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుమల పవిత్రతను మంటగలుపుతున్న వైసీపీ

♦ అన్యమతస్తులకు ప్రధాన బాధ్యతలు

♦ బుచ్చి రాంప్రసాద్ ధ్వజం



అమరావతి: ఎన్నడూ లేని విధంగా వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ ధ్వజమెత్తారు. ఆదివారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ...జగన్ మోహన్ రెడ్డి అర్జునుడని చెప్పుకుంటున్నాడు.. కానీ అతను అసురుడని విమర్శించారు. తిరుమలలో కైంకర్యాలు సక్రమంగా జరగడం లేదని తిరుమల మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు వీడియో విడుదల చేసిన వెంటనే ఆయన మీద కేసు నమోదు చేశారు. రమణ దీక్షితులను భయపెట్టి తాను ఆ ప్రకటన ఇవ్వలేదని చెప్పించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తిరుమల స్వామివారికి చెందిన పింక్ డైమెండ్ తీసుకెళ్లారని ఇదే రమణ దీక్షితులు ఆరోపించారు. అవి తప్పుడు ఆరోపణలైనా ఆయనపై చంద్రబాబు కేసు పెట్టలేదు. ఎందుకంటే నిజానిజాలు ప్రజలకు తెలుసు కాబట్టి. తిరుమల పవిత్రతకు భంగం కలగకూడదు, రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరైనా మాట్లాడినా పట్టించుకోవద్దని అప్పట్లో చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. రమణ దీక్షితులు ఎన్ని ఆరోపణలు చేసినా తిరుమల ప్రతిష్ఠకు భంగం కలుగకూడదనే మంచి మనస్సుతో ఆ తప్పుడు ఆరోపణలను చంద్రబాబు పట్టించుకోలేదు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పింక్ డైమెండ్ ఊసే ఎత్తకుండా మౌనం వహించారు.

అసలు పింక్ డైమెండ్ అనేది లేదనే విషయం వారికి తెలిసినప్పటికీ గతంలో దురుద్దేశపూర్వకంగా చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలు చేశారు. కానీ ఈ ప్రభుత్వం మాత్రం నిజంగా రమణ దీక్షితులు అన్నారో లేదో తెలియకుండానే ఆయనపై కేసు నమోదు చేసింది. హిందూ మతం మీద విశ్వాసంలేని వ్యక్తులకు తిరుమలలో ప్రధాన బాధ్యతలు అప్పగించారు. నువ్వు హిందూవా! కాదా! అని అడిగితే సమాధానం చెప్పకుండా మౌనంగా వెళ్ళిపోయే వ్యక్తి టీటీడీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి. దేశంలో ఎక్కడా జరగని విధంగా మన రాష్ట్రంలో వైకాపా పాలనలో దేవాలయాలపై దాడులు జరిగాయి. హిందూ మతంపై గౌరవం లేని వ్యక్తి జగన్ రెడ్డి. శ్రీశైలం భ్రమరాంబిక అమ్మవారి ప్రసాదంలో ఎముకలు వచ్చాయి. అంతర్వేది రథం దగ్ధం, ఇంద్రకీలాద్రిలో వెండి సింహాలు చోరీ, ఇలా ఎన్నో దేవాలయాల్లో దోపిడీలు, ఆలయాలపై దాడులు జరిగినా ఇప్పటి వరకు దోషులను పట్టుకోలేదు. మరో 40 రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయి. జగనాసురుడిని రాష్ట్రం నుంచి తరిమేద్దామని బుచ్చి రాంప్రసాద్ పిలుపునిచ్చారు.

# టీడీపీ శ్రేణుల ఆనందోత్సాహాలు

తొలిజాబితాలో తమ నాయకులను అభ్యర్థులుగా ప్రకటించడంతో పలు నియోజక వర్గాల్లో టీడీపీ-జనసేన కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. రోడ్డుపై బాజా సంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి, ప్రజా సమస్యలపై పోరాడే తమ నేతలకు సీట్లు కేటాయించడంపై అనందం వ్యక్తం చేశారు. జగ్గయ్యపేటలో శ్రీరాం రాజగోపాల్ తాతయ్యను, వేమూరులో నక్కా అనందబాబును, బాపట్లలో వేగేశ్న నరేంద్రకుమార్‌ను, పర్చూరులో ఏలూరి సాంబశివరావును, అద్దంకిలో గొట్టిపాటి రవికుమార్‌ను, ఒంగోలులో దామచర్ల జనార్ధనరావును, తంబళ్లపల్లిలో దాసిరెపల్లి జయచంద్రారెడ్డిని ప్రకటించడం పట్ల స్థానిక టీడీపీ-జనసేన కార్యకార్తలు సంతోషం వ్యక్తం చేశారు. రోడ్లపైకి వచ్చి తమ నాయకులకు జిందాబాద్‌లు కొడుతూ స్వీట్లు పంచిపెట్టారు. టపాసులు కాల్చారు. రానున్న ఎన్నికల్లో తమ అభ్యర్థులు గెలిచి తీరుతారని, చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని వారు పేర్కొన్నారు.





## వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడండి

గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్



గుంతకల్లు, చైతన్యరథం: గుంతకల్లు పట్టణం 26వ వార్డు నందు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు నియోజకవర్గం ఇన్‌ఛార్జ్,మాజీ శాసనసభ్యులు ఆర్.జితేంద్రగౌడ్ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నుంచి ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని, వార్డు,గ్రామాల నందు సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించరని, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెంది యువతకు, నిరుద్యోగులకు,రోజువారి కార్మికులకు ఉపాధి లభిస్తుందని అన్నారు. సూపర్ సెక్స్ సంక్షేమ పథకాలు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు మరియు గుంతకల్లు పట్టణం, మండలం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రానున్నది ఉమ్మడి ప్రభుత్వమే: వేగుళ్ళ

కపిలేశ్వరం, చైతన్యరథం: వచ్చే ఎన్నికల్లో రానున్నది ఉమ్మడి ప్రభుత్వమేనని శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. కపిలేశ్వరపురం మండలం, పడమరఖండ్రిక గ్రామంలో "బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ" కార్యక్రమంలో టిడిపి, జనసేన శ్రేణులతో కలసి క్లస్టర్ 9లో యూనిట్ 34లో ఎమ్మెల్యే ఇంటింటికీ పర్యటించారు.ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ ఇంటికి తిరిగి వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు.టీడీపీ జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు చేకూరే లబ్ధిని వివరించారు. ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అవినీతి కూపంలో నెట్టి,రాక్షస పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయా ఎప్పుడు ఓటు ద్వారా జగన్ ప్రభుత్వాన్ని తరిమేద్దామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు అవటం ఖాయమన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం మరలా అభివృద్ధి ప్రధాత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు.చంద్రబాబుపాలనలో అన్నీవర్గాల ప్రజలు ఎంతో సుఖసంతోషాలతో వర్ధిల్లారన్నారు. మరలా ఏపీకి మంచి రోజులు రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రచార సారథులకు ఎన్ఆర్ఐ టీడీపీ కువైట్ సన్మానం

కువైట్, చైతన్యరథం: ఎన్.ఆర్.ఐ. టీడీపి మరియు జనసేన కువైట్ ఆధ్వర్యంలో, యన్.ఆర్.ఐ. టీడిపి కువైట్ అధ్యక్షులు అక్కిలి నాగేంద్రబాబు అధ్యక్షతన "రా కదలి రా..." "నిజం గెలవాలి నేజమే గెలవాలి" మరియు "శంఖారావంకు" మద్దతుగా మనటిడిపి యాప్ ను డౌన్ లోడ్ చేసి, సోషల్ మీడియాలో షేర్ చేసి 2,51,550 పాయింట్స్ సాధించిన దొడ్డిపల్లె సుబ్బరాజును, 1,15,000 పాయింట్స్ సాధించిన కుర్రా రమణా యాదవ్‌ను, లక్షకు క్రిందిస్థాయిలో పాయింట్స్ సాధించిన చాలామంది నాయకులకు మరియు కార్యకర్తలను, జనసేన పార్టీ ద్వారా సేవలందించిన జనసేన గల్ఫ్ జాతీయ మరియు ప్రాంతీయ స్థాయి నాయకులను యన్.ఆర్.ఐ. టీడిపి కువైట్ శుక్రవారం నాడు సన్మానించింది. భవిష్యత్తులో మన టిడిపి యాప్ ద్వారా తెలుగుదేశం పార్టీకి సేవలు అందించిన ప్రతిఒక్కరిని ఆహ్వానించి గౌరవిస్తామని యన్.ఆర్.ఐ.తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాగేంద్ర బాబు అక్కిలి తెలియ చేశారు. ఈ సన్మాన సభకు ముఖ్య అతిదులుగా కాంచన శ్రీకాంత్, గల్ఫ్ జనసేన జాతీయ కన్వీనర్, బాణావత్ రామచంద్ర నాయక్ గల్ఫ్ జనసేన జాతీయ కన్వీనర్, చంద్రశేఖర్ జనసేన కొకన్వీనర్, ఓబులేష్ జనసేన నాయకులు హాజరయ్యారు. అదేవిధంగా ఈ సమావేశంలో పాల్గొన్న యన్.ఆర్.ఐ.టీడిపి కువైట్ ముఖ్య సీనియర్ నాయకులు రాణి చౌదరి, నిర్మలా ముండ్లపాటి, సత్యవతి, రమణా యాదవ్ కుర్రా, దొడ్డిపల్లి సుబ్బరాజు, విజయ్ కుమార్ పసుపులేటి, జగదీష్, సాయిబాబా దౌర్ల, బిల్లా సత్యనారాయణ, పిడుగు నరసింహా, సుబ్బయ్య, నరసింహా యాదవ్, షేక్ రియాజ్ బాష,ఇలియాజ్ భాష, బాబు బకాల, పందు యాదవ్, సాయి యాదవ్ ఈరపరాజు పెంచల్ రాజు, మణి, రవి, యల్లాపల్లి భాస్కర్ పాల్గొన్నారు.



# వైసీపీకి గుడ్ బై.. తెలుగుదేశం పార్టీకి జై

**ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలోకి భారీగా వలసలు**



కందుకూరు, చైతన్యరథం: కందుకూరు పట్టణం 3వ వార్డు ఉప్పుచెరువు ప్రాంతంలో ఆదివారం అధికారపార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి... నియోజకవర్గ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇంటూరి నాగేశ్వరరావు గెలుపు కోసం, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు శాయశక్తులా పనిచేస్తామని కొత్తగా పార్టీలో చేరిన వారు స్పష్టంచేశారు. రాబోయే ప్రభుత్వంలో పార్టీలో చేరిన అందరికీ తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని నాగేశ్వరరావు తెలియజేశారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, కుటుంబ సభ్యుల్లాగా చూసుకుంటానని... రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు,పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శీను, వార్డు నాయకులు వేముల ప్రసాద్,వేముల ఫణీంద్ర, భవనాసి వెంకటేశ్వర్లు, గుర్రం మధు, షేక్ కరీముల్లా, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు, రాష్ట్ర వాణిజ్య భాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు వడ్డెళ్ళ రవిచంద్ర,నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు షేక్ మున్నా, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ సలాం, పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు,పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షులుపులి నాగరాజు, పోకూరి రాంబాబు, కొమ్మి వెంకట ప్రవీణ్, యర్రా మూసలయ్య, షేక్ ఫిరోజ్, ముప్పవరపు వేణు, దాసరి ప్రమోద్, బద్దిపూడి శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

# యర్రగొండపాలెంలో గెలిచి చంద్రబాబుకి కానుకగా ఇస్తా

**గూడూరి ఎరిక్షన్ బాబు ధీమా - దోర్నాలలో 20 కుటుంబాలు టీడీపీలో చేరిక**



యర్రగొండపాలెం, చైతన్యరథం: రాష్ట్ర హితం కోరుకునేవారంతా టీడీపీలో చేరుతున్నారని, త్వరలో యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవుతుందని టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. దోర్నాల మండలం ఐనముక్కల గ్రామం అంబేద్కర్ నగర్‌లో వైసీపీని వీడి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి ఎరిక్షన్ బాబు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ 5 ఏళ్ల పాలనలో రాష్ట్రంలో గానీ, నియోజవర్గంలో గానీ జరిగిన అభివృద్ధి శూన్యం. గత టీడీపీ హయాంలో జరిగిన అభివృద్దే తప్ప వారి పాలనలో జరిగిన అభివృద్ధి ఏంటో వైసీపీ నేతలు చెప్పాలి. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే పూర్తైనట్టు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే వెలుగొండ పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం. వైసీపీ పాలన నచ్చక చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీలో చేరుతున్నారు. త్వరలో నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవటం ఖాయం. పార్టీలో మొదటి నుంచి ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూనే కొత్తగా వచ్చిన వారికి తగిన గౌరవం ఇస్తాం. వచ్చే ఎన్నికల్లో యర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తానని ఎరిక్షన్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బిల్లుల చెల్లింపుల్లో పక్షపాతం

**- జగన్‌కు కావాల్సిన సంస్థలకు మాత్రమే చెల్లింపులు**

**- టీడీపీ నేత ఆనం రమణారెడ్డి విమర్శ**

నెల్లూరు:రాష్ట్రంలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ముఖ్యమంత్రి జగన్ పక్షపాతం చూపిస్తున్నారని టీడీపీ సీనియర్ నేత ఆనం వెంకటరమణారెడ్డి విమర్శించారు. నెల్లూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌కు కావాల్సిన వారికి మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారని తప్పుబట్టారు. మరోపక్క వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటూ పలువురు కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నా జగన్ పట్టించుకోవటం లేదన్నారు. జగన్ ముద్దు బిడ్డ పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అని... వైకాపా పాలనలో ఆ సంస్థ లాభాలు బాగా పెరిగాయన్నారు. జగన్ మరో ముద్దు బిడ్డ షిరిడీసాయి ఎలక్ట్రికల్స్. బిల్లులు పెట్టిన వెంటనే ఈ రెండు సంస్థలకు చెల్లింపులు జరిగిపోతున్నాయి. మరోపక్క సూక్ష్మ, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు గతేడాది జులై నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి. వీటికి నెలన్నరలోనే చెల్లింపులు చేయాలని నిబంధనలు ఉన్నాయి. పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు మాత్రం ఆరు నెలల్లోనే బిల్లులన్నీ చెల్లించారు. ముఖ్యమంత్రికి కావాల్సిన మరో సంస్థ రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు కూడా వెంటనే చెల్లింపులు చేశారు. బిల్లుల అడ్డగోలు చెల్లింపులపై మా ప్రభుత్వం వచ్చాక విచారణ చేపడతామని రమణారెడ్డి స్పష్టం చేశారు.



## 'టీడీపీ-జనసేన ఉమ్మడి సభను జయప్రదం చేయండి'

తాడేపల్లిగూడెం, చైతన్యరథం: ఈనెల 28వ తారీఖున తాడేపల్లిగూడెంలో జరుగబోయే తెలుగుదేశం - జనసేన బహిరంగ సభను విజయవంతం చేయాలని కొవ్వూరు నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి, కంఠమని రామకృష్ణ, జనసేన ఇన్‌ఛార్జి టీవీ రామారావు కోరారు. ఆదివారం కొవ్వూరు జనసేన కార్యాలయంలో విలేఖరుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు గొర్రెల శ్రీధర్,తెలుగుదేశం తాళ్లపూడి మండల ప్రెసిడెంట్ నామన పరమేశ్వరరావు , కొవ్వూరు మండల ప్రెసిడెంట్ వట్టికూటి వెంకటేశ్వరరావు, జనసేన టౌన్ ప్రెసిడెంట్ దేగల రాము, కొవ్వూరు మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు, తెలుగుదేశం కొవ్వూరు టౌన్ మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపని చిన్ని, సూర్యదేవర రంజిత్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు,పెనుమాక జయరాజు, కళాదర్ చక్రవర్తి, సిద్ధా దుర్గా ప్రసాద్, రాజాన శ్రీను మరియు తెలుగుదేశం-జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజధానిలో మట్టి దొంగలకు పోలీసుల అండ

**- దొంగలను పట్టేస్తున్నా వదిలేస్తున్న వైనం**

**- తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ విమర్శ**



అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలో రోడ్లను తవ్వేసి, మట్టి దొంగిలిస్తున్న వైసీపీ గూండాలకు పోలీసుల అండదండలున్నాయని టీడీపీ అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని రోడ్ల దొంగతనాలు ఏపీలో జగన్ పాలనలో జరగడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని గ్రామాలైన దొండపాడు, రాయపూడి, ఉద్దండరాయపాలెం ప్రాంతాల్లో వైసీపీ గూండాలు రాత్రి సమయాల్లో పొక్లెయినర్లతో రోడ్లను తవ్వి కంకర, మట్టి తరలిస్తున్నా పోలీసులు చూసీ, చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రోడ్ల పక్కన ఉంచిన మంచినీటి పైపులను గ్యాస్ కట్టర్లతో కట్ చేసి తరలించుకుపోతున్నారన్నారు. అదే విధంగా రాజధానిలో భవన నిర్మాణాల కోసం తీసుకువచ్చిన ఇనుము, ఇతర విలువైన సామగ్రిని వైసీపీ నాయకుల అండదండలతో దొంగలు దోచుకుంటున్నారన్నారు. ఈ విషయమై రైతులు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఇప్పటి వరకు ఒక్కరిని కూడా పోలీసులు పట్టుకున్న దాఖలాలు లేవని ఆయన ఆరోపించారు. వెంకటపాలెం, రాయపూడి, దొండపాడు గ్రామాల్లో రైతులకు కేటాయించిన ప్లాట్లలో కొంతమంది మట్టి దొంగలు రాత్రిపూట పొక్లెయినర్లతో మట్టిని తవ్వి లారీలతో తరలిస్తున్న దొంగలను రైతులు పట్టుకొని పోలీసులకు అప్పజెప్పినా ఏ విధమైన కేసులు నమోదు చేయలేదని ఆరోపించారు. మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీలను కూడా పోలీసులకు అప్పగించినా ఆ లారీలను వదిలేశారన్నారు. దీనిపై సీఆర్డీఏ, రెవెన్యూ, పోలీసు శాఖలు వెంటనే చర్యలు తీసుకోవాలని రమేష్ డిమాండ్ చేశారు.

# ఎందుకు సెలబ్రేట్ చేసుకోలేదంటే..!

టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటున్న కథానాయికల్లో రష్మిక ఒకరు. 'యానిమల్' సినిమాతో ఇటీవల మంచి విజయాన్ని అందుకున్నారు. సక్సెస్‌ను ఆమె సెలబ్రేట్ చేసుకోక పోవడంపై బాలీవుడ్‌లో చర్చ జరిగింది. తాను ఇంటర్వ్యూలు, సినిమాకి సంబంధించి వేడుకల్లో పాల్గొనకపోవడంపై పలు రకాల ఊహాగానాలు వినిపించాయి.



వాటిపై రష్మిక సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తన కొత్త సినిమా సెట్స్‌లో దిగిన ఫొటోలను పంచుకుంటూ 'యానిమల్' సక్సెస్‌ను తానెందుకు ఆస్వాదించలేకపోయారో వివరించారు. "మేం (యానిమల్ టీమ్) అందించిన భారీ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించారు. ప్రశంసలు కురిపించారు. ఆ విజయాన్ని ఆస్వాదించడానికి నేనూ కొంత సమయం కేటాయించాలనుకున్నా. కానీ, 'యానిమల్ విడుదలైన మరుసటి రోజే మరో సినిమా చిత్రీకరణలో పాల్గొన్నా. నాకు పని పట్ల ఎంత నిబద్ధత ఉందో అర్థం చేసుకోండి (నవ్వుతూ...). ఇంటర్వ్యూల్లోనూ, విజయోత్సవ వేడుకల్లోనూ పాల్గొనలేకపోయా. ప్రతిష్ఠాత్మక చిత్రాల షూటింగ్స్ కోసం రాత్రుళ్లు కూడా ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. మీరు నన్ను మిస్ అవుతున్నారని నాకు తెలుసు. లోటును నేను నటిస్తున్న క్రేజీ ప్రాజెక్టులు భర్తీ చేస్తాయని భావిస్తున్నా. అవి మిమ్మల్ని విశేషంగా అలరిస్తాయి. మీరు వాటిని చూస్తూ ఎంజాయ్ చేసే క్షణాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. అన్నింటికీ మించి మీ ప్రేమే నాకు సంతోషాన్ని ఇస్తుంది" అని పేర్కొన్నారు. రష్మిక షేర్ చేసిన ఫొటోల్లో ఆమె ముఖం పూర్తిగా కనిపించలేదు. ముఖానికి అడ్డుగా ఫోన్ పెట్టారు. తన కొత్త సినిమాలోని పాత్ర కోసం రెడీ అయ్యాయని, అందుకే ఫుల్ ఫేస్ చూపించలేకపోతున్నానని తెలిపారు. అధికారికంగా చిత్ర బృందం విడుదల చేయకుండా లుక్ బయటపెట్టడం సబబు కాదన్నారు. షూటింగ్ చాలా బాగా జరుగుతోందని పేర్కొన్నారు. అదే సినిమానో చెప్పలేదు. 'పుష్ప 2' 'రెయిన్ బో', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'భావా' (హిందీ) సినిమాలతో బిజీగా ఉన్నారామె.

# మూడో చిత్రం



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' సినిమాల తర్వాత ఈ ఇద్దరి నుంచి రానున్న మూడో చిత్రమిది. దీన్ని దిల్‌రాజు నిర్మించనున్నారు. ఇందులో వెంకీ సరసన ఇద్దరు కథానాయికలు కనిపించనున్నారని సమాచారం. వారిలో ఒకరు సీనియర్ నాయిక ఉండనున్నట్లు తెలిసింది. ఇప్పటికే నాయికల వేట మొదలైంది. ప్రస్తుతం ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ముగింపు దశలో ఉన్నాయి. వెంకటేశ్ నుంచి కోరుకునే కుటుంబ అంశాలతో పాటు అనిల్ శైలి వినోదాలతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ఈ వేసవిలో పట్టాలెక్కనున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మహాశివరాత్రికి భీమా

ఈ మహాశివరాత్రికి 'భీమా'తో థియేటర్లలో సందడి చేయనున్నారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని ఎ.హర్ష తెరకెక్కించారు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ప్రేయ భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. ఈ సినిమా మార్చి 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో శనివారం ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. ఈ ప్రచార చిత్రంలో కనిపించిన సన్నివేశాల్ని బట్టి సినిమాలో యాక్షన్‌తో పాటు సూపర్ నేచురల్ ఫాంటసీ అంశాలకి కూడా చోటున్నట్లు అర్థమవుతోంది. పరశురాముడి క్షేత్రం కోసం బ్రహ్మరాక్షసుడి లాంటి ఓ పోలీసు చేసిన దుష్ట సంహారమే ఈ చిత్ర కథాంశంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ ట్రైలర్ విడుదల సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ... "ట్రైలర్ చాలా అద్భుతంగా అనిపించింది. దర్శకుడు హర్ష కథ ఎంత బాగా చెప్పాడో... అంతకంటే చక్కగా తెరకెక్కించాడు. రవి బసూర్ నేపథ్య సంగీతం ఇరగదీశాడు. సినిమా అంతా మరోస్థాయిలోనే ఉంటుంది. ఇందులో ప్రియ, మాళవిక శర్మల పాత్రలకు చాలా ప్రాధాన్యముంటుంది. ఇది చాలా మంచి సినిమా. శివరాత్రి సందర్భంగా విడుదలవుతోంది. తప్పకుండా థియేటర్స్‌లో చూసి ఆనందించండి" అన్నారు. "గొప్ప థియేట్రికల్ అనుభూతిని అందించే చిత్రమిది. దీంట్లో గోపీచంద్‌ను చాలా భిన్నమైన పాత్రలో చూడనున్నారు. యాక్షన్‌తో పాటు వినోదం కూడా చాలా గొప్పగా ఉంటుంది" అన్నారు దర్శకుడు ఎ.హర్ష, నిర్మాత కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ... "సినిమా అద్భుతంగా వచ్చింది. అందర్నీ అలరిస్తుందని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియ భవానీ శంకర్, మాళవిక వి.కె.నరేశ్ తదితరులు పాల్గొన్నారు.




# పట్టు బిగించిన భారత్

**152 పరుగుల దూరంలో విజయం**

**ఐదు వికెట్లు తీసిన అశ్విన్**




రాంచీ: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచ్‌లో భారత్ పట్టు బిగించింది. పర్యటక జట్టును తక్కువ పరుగులకే కట్టడి చేసిన టీమ్‌ఇండియా... టార్గెట్ వైపు దూసుకుపోతోంది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 198పరుగుల లక్ష్యఛేదనలో మూడోరోజు ఆట ముగిసే సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 40 పరుగు లు చేసింది. క్రీజ్‌లో రోహిత్‌శర్మ(14),యశస్వి జైస్వాల్ (16లి) ఉన్నారు. టీమ్‌ఇండియా విజయానికి ఇంకా 152 పరుగులు అవసరం. మరో రెండు రోజుల సమ యం ఉన్న నేపథ్యంలో గెలవడం పెద్ద కష్టమేం కాదు. కానీ, నాలుగో రోజు తొలిసెషన్‌లో కాసేపు ఇంగ్లాండ్ బౌలర్లను అడ్డుకోగలిగితే విజయం తేలికవుతుంది. భారత స్పిన్నర్లు అదర గొట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 145 పరుగులకే ఆలౌట్ చేశారు. రవిచంద్రన్ అశ్విన్ (5/51), కుల్‌దీప్ యాదవ్ (4/22), రవీంద్ర జడేజా (1/56) వికెట్లు తీశారు. జాక్ క్రాలే (60) హాఫ్ సెంచరీ సాధించగా... జానీ బెయిర్ స్టో (30), బెన్ ఫోక్స్ (11) కాస్త ఫర్వాలేదనిపించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 48 పరుగులతో కలిపి భారత్ ఎదుట ఇంగ్లాండ్ 206 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. మొదటి ఇన్నింగ్స్‌లో పర్యటక జట్టు 353 పరుగులు చేయగా... టీమ్‌ఇండియా 301 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ 219/7 స్కోరుతో ఆదివారం ఆటను ప్రారంభించిన భారత్‌ను కుల్‌దీప్ (28) - ధ్రువ్ జురెల్ (90) జోడీ ఆదుకుంది. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 76పరుగుల భాగ స్వామ్యం నిర్మించారు. కుల్‌దీప్ ఔటైనప్పటికీ... ఆకాశ్ దీప్ (9)తో కలిసి ధ్రువ్ టీమ్‌ఇండియా స్కోరు 300 దాటించారు. అయితే, సెంచరీకి పది పరుగుల దూరంలో టామ్ హార్ట్‌లీ బౌలింగ్‌లో ధ్రువ్ బౌల్డ్ కావడంతో భారత ఇన్నింగ్స్ ముగిసింది. యశస్వి జైస్వాల్ (73), శుభ్‌మన్ గిల్ (38) ఫర్వాలేదనిపించారు. షోయబ్ బషీర్ (5/119) ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. టామ్ హార్ట్‌లీ 3, జేమ్స్ అండర్సన్ 2 వికెట్లు తీశారు. భారత్ 88 పరుగులు జోడించి ఆఖరి మూడు వికెట్లను కోల్పోయింది.

# మరో ధోనీలా కనిపిస్తున్నాడు

*ధ్రువ్ జురెల్‌పై గవాస్కర్ ప్రశంసలు*

రాంచీ: భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో వికెట్‌కీపర్ ధ్రువ్ జురెల్ 90 పరుగులు చేశాడు. టీమ్‌ఇండియా మెరుగైన స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతనిపై మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. లెజెండరీ క్రికెటర్ ధోనీతో పోల్చాడు. ఇదే ఆటతీరును కొనసాగిస్తే మెరుగైనభవిష్యత్తు ఉంటుందని జోస్యం చెప్పాడు. "ధ్రువ్ జురెల్ ఏకాగ్రత చూస్తుంటే నాకు మరో ఎం.ఎస్.ధోనీ తయారవుతున్నాడనిపిస్తోంది. ఈరోజు అతడికి శతకం చేజారి ఉండొచ్చు. కానీ, ఇదే ఏకాగ్రతతో ఆడితే అతడు చాలా సెంచరీలు చేస్తాడు" అని కామెంటరీలో భాగంగా గావస్కర్ విశ్లేషించాడు. నాలుగో టెస్టు రెండో రోజు ఆట ముగిసే సరికి ధ్రువ్ 30 పరుగులతో క్రీజులో ఉన్నాడు. మూడో రోజు కుల్దీప్‌తో కలిసి కీలకఇన్నింగ్స్ ఆడిన అతడు మరో 60 పరుగులు జోడించాడు. మధ్యాహ్న భోజన విరామానికి ముందు టామ్ హార్ట్‌లీ వేసిన బంతికి ధ్రువ్ క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరి గాడు. 149 బంతుల్లో రెండు సిక్సులు, నాలుగు ఫోర్లతో 90 పరుగులు సాధించాడు. దీంతో కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేసుకునే అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్నాడు.




## శ్రీలంక కెప్టెన్ హసరంగాపై ఐసిసి నిషేధం

ఇంటర్నెట్ డెస్క్: శ్రీలంక టీ20 కెప్టెన్ వనిందు హసరంగాపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని విధించింది.అఫ్గనిస్థాన్‌తో జరిగిన చివరి టీ20లో అంపైర్ లిండన్ హన్నిబల్‌పై వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు ఈ నిర్ణయం తీసుకుంది. "ఐసీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించి అంపైర్‌ను వ్యక్తిగతంగా దూషించినందుకు మ్యాచ్ ఫీజులో 50శాతం కోతతో పాటు రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని హసరంగాపై విధిస్తున్నాం" అని ప్రకటన విడుదల చేసింది. దీంతో వచ్చేనెలలో బంగ్లాదేశ్‌తో జరగనున్న మొదటి రెండు టీ20 మ్యాచ్‌లకు హసరంగా దూరం కానున్నాడు. అఫ్గనిస్థాన్‌తో జరిగిన మూడో టీ మ్యాచ్‌లో శ్రీలంకకు 3 బంతుల్లో 11 పరుగులు కావాలి. ఈ సమయంలో అఫ్గాన్ బౌలర్ వఫాదర్ వేసిన బంతి బ్యాటర్ కమిందు మెండిస్ నడుము కంటే ఎత్తులో వెళ్లింది. లెగ్ అంపైర్‌గా ఉన్న హన్నిబల్ దాన్ని నోబాల్‌గా ప్రకటించలేదు. ఈ మ్యాచ్‌లో 8 పరుగుల తేడాతో శ్రీలంక ఓటమి పాలైంది. మ్యాచ్ అనంతరం హసరంగా మాట్లాడుతూ బంతి బ్యాటర్ నడుముకంటే ఎత్తుగా వెళ్లింది. అంపైర్ దాన్ని గమనించలేకపోతే అతడు క్రికెట్‌కు పనికిరాడు. వేరే పని చూసుకోవడం మంచిది అంటూ ఘాటుగా వ్యాఖ్యానించాడు. మరోవైపు ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ బ్యాటర్ రెహ్మానుల్లా గుర్బాజ్ పై కూడా వేటు పడింది. అంపైర్ సూచనలు పాటించకుండా ఫీల్డ్‌లో పదే పదే బ్యాట్ గ్రిప్ మార్చుకోవడంతో అతని మ్యాచ్ ఫీజు నుంచి 15 శాతాన్ని ఐసీసీ కోత విధించింది.





## రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో అఖిలేష్ యాదవ్

లక్నో: కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ పాల్గొన్నారు. ఇవాళ ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా నగరానికి రాహుల్ యాత్ర చేరుకోగా.. అఖిలేష్ యాదవ్ యాత్రలో పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొన్న కీలక ప్రతిపక్ష నేత అఖిలేష్ యాదవే కావడం గమనార్హం. ఇప్పటివరకు రాహుల్ యాత్రలో పాల్గొన్న ప్రతిపక్ష నేతలెవరూ అఖిలేష్ యాదవ్ స్థాయిలో లేరు. ఇటీవల పశ్చిమబెంగాల్ మీదుగా రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర సాగింది. అయితే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఎంసీ అధ్యక్షురాలు మమతాబెనర్జీ యాత్రలో పాల్గొనలేదు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాల పంపకం విషయంలో సమాజ్‌వాది-కాంగ్రెస్ పార్టీల మధ్య కొద్ది రోజులపాటు కొనసాగిన ప్రతిష్టంభనకు ఇటీవలే తెరపడింది. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ సమాజ్‌వాది పార్టీ ఆఫర్ చేసిన 17 సీట్లకు అంగీకారం తెలుపడంతో ఆ ప్రతిష్టంభనకు ఫుల్‌స్టాప్ పడింది. ఈ క్రమంలో ఆదివారం రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో అఖిలేష్ యాదవ్ పాల్గొన్నారు.

## అమెరికా నౌకపై హౌతీల దాడి



ఎర్రసముద్రం: ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు ఆగడం లేదు. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు నానాటికీ రెచ్చిపోతున్నారు. ఎర్రసముద్రం మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాణిజ్య నౌకలే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారు. తాజాగా మరోసారి దాడికి పాల్పడ్డారు. గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో అమెరికా జెండాతో వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ నౌక ఎంవీ టార్మ్ థార్‌పై మిస్సైళ్లతో దాడి చేశారు. ఈ దాడి ఘటనలో ట్యాంకర్ నౌకకు కానీ, సిబ్బందికి గానీ ఎలాంటి నష్టం జరగలేదు.

### అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో

## దూసుకుపోతున్న ట్రంప్

### సొంత రాష్ట్రంలోనూ నిక్కి హేలీకి తప్పని ఓటమి



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో డొనాల్డ్ ట్రంప్ దూసుకుపోతున్నారు. దక్షిణ కరోలినా రిపబ్లికన్ ప్రైమరీలో ఘన విజయం సాధించారు. ట్రంప్ హవా ధాటికి సొంత రాష్ట్రంలో నిక్కీ హేలీకి ఓటమి తప్పలేదు. మాజీ అధ్యక్షుడికి 63శాతం ఓట్లు రాగా హేలీకి 36.8 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆయన ఇప్పటికే న్యూ హాంప్ షైర్, నెవడా, ఐయోవా, వర్జిన్ ఐలాండ్స్‌లో విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష పదవి అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న భారత సంతతికి చెందిన హేలీ గతంలో రెండుసార్లు సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేశారు. తన కంచుకోటలోనే ఓడిపోవడంతో.. అధ్యక్ష పదవి పోటీకి ట్రంప్ అభ్యర్థిత్వం ఖాయమైపోయినట్లేనని ప్రచారం జరుగుతున్నది. నిక్కీ హేలీ పార్టీ అధ్యక్ష పదవి అభ్యర్థిత్వానికి పోటీ నుంచి తప్పుకోవాలని ట్రంప్ వర్గం డిమాండ్ చేస్తున్నది. అయితే తాను రేసు నుంచి తప్పుకునేది లేదని ఆమె ప్రకటించారు. మార్చి 5న జరిగే పలు స్టేట్ ప్రైమరీ ఎన్నికల్లో పోటీలో ఉంటానని స్పష్టం చేశారు.

# స్కూబా డైవింగ్ ద్వారా సముద్ర జలాల్లోకి ప్రధాని మోదీ

### అరేబియా సముద్రం అడుగున ఉన్న ద్వారక వద్ద ప్రత్యేక పూజలు

గాంధీనగర్: కొన్ని నెలల వ్యవధిలోనే అరేబియా సముద్రంలో ప్రధాని మోదీ మరోసారి డైవింగ్ చేశారు. ఆయన ఆదివారం హిందువుల పురాతన ఆధ్యాత్మిక నగరమైన ద్వారకా వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ఇందుకోసం ఆయన స్కూబా డైవింగ్ ద్వారా సముద్రజలాల్లోకి వెళ్లారు. ఒకప్పుడు శ్రీకృష్ణుడు ఈ నగరాన్ని పరిపాలించినట్లు హిందువులు బలంగా విశ్వసిస్తారు. ద్వారకా ద్వీపం వద్ద ప్రధాని మోదీ ఆదివారం స్కూబా డైవింగ్ చేశారు. ఇందుకు అవసరమైన పరికరాలను ధరించారు. అనంతరం నీటిలోకి దిగి పురాతన నగరం అవశేషాల వద్దకు చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తన అనుభవాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకొన్నారు."సముద్ర గర్భాన ఉన్న ద్వారకాలో పూజలు చేయడం ఓ దివ్యానుభవం. పురాతన యుగాల్లోని కాలాతీత భక్తికి అనుసంధానమైన అనుభూతిని పొందాను. శ్రీకృష్ణుడు అందరినీ అనుగ్రహిస్తారు" అని పోస్టులో పేర్కొన్నారు. దీనికి ఆ చిత్రాలను జతచేశారు. ప్రధాని కొన్ని నెలల క్రితం లక్షద్వీప్ వద్ద స్కూబా డైవింగ్ చేసిన విషయం తెలిసిందే.



భారత్‌లోని సప్త మోక్షదాయక నగరాల్లో ద్వారక ఒకటిగా సంప్రదాయం చెబుతోంది. పశ్చిమ సముద్రతీరంలో సౌరాష్ట్ర(నేటి గుజరాత్)లో ద్వారకా పట్టణం ఉంది. దాన్ని 'ద్వారావతి' అనే పేరుతోనూ వ్యవహరించేవారు. అనేక ద్వారాలు ఉండటం వల్ల ఈ పేర్లు వచ్చాయని భావిస్తున్నారు. ద్వారకలో నందన, చైత్రరథ, మిశ్రక, వైభ్రాజ అనే నాలుగు ఉద్యానవనాలుండేవి. వైష్ణవ సంప్రదాయంలోని 108 దివ్య దేశాల్లో ఇది ఒకటి. మహాభారతం సభా, శాంతి పర్వాల్లో ద్వారకను గురించి అనేక విషయాల ప్రస్తావన ఉంది. జరాసంధుడు అనే రాక్షసుడి దాడుల నుంచి రక్షణ పొందేందుకు సురక్షితమైన ప్రాంతం కావాలన్న శ్రీకృష్ణుడి కోరికపై విశ్వకర్మ ద్వారకను నిర్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ సుందర నగరం అరేబియా సముద్రంలో మునగడంతో భక్తులెవరూ అక్కడికి వెళ్లలేకపోతున్నారు. ఈ ప్రాచీన నగరాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా గుజరాత్ ప్రభుత్వం జలాంతర్గామి సేవలను ప్రారంభించింది. ఇందుకోసం ముంబయికి చెందిన ప్రభుత్వ రంగ నౌకా సంస్థ మజ్‌గావ్ డాక్‌యార్డ్‌తో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జలాంతర్గామికి 24 మంది యాత్రికులను తీసుకెళ్లే సామర్థ్యం ఉంది. పర్యాటకులతో పాటు ఇద్దరు పైలట్లు, ఇద్దరు డైవర్లు, టెక్నీషియన్, గైడ్ కూడా ఉంటారు. ఇది భక్తులను అరేబియా సముద్రంలో 300 అడుగుల దిగువకు తీసుకెళ్తుంది... అక్కడి నుంచి పురాతన నగర శిథిలాలతో పాటు అరుదైన సముద్ర జీవాలను చూడగలరు.

# రాజ్ థాక్రేపై మండిపడ్డ సుప్రియా సూలే



ముంబయి: మహారాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం కొనసాగుతున్నది. ఒకవైపు నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీలో చీలిక, ఆ పార్టీ ఎవరిదనే విషయంలో వివాదం కొనసాగుతున్నది. ఈ క్రమంలో భారతీయ జనతా పార్టీ, మహారాష్ట్ర నవ నిర్మాణ సేన పొత్తుపై ఊహాగానాలున్నాయి. ఎన్‌సీపీ శరద్‌చంద్ర పవార్ పార్టీ నాయకురాలు, బారామతి ఎంపీ సుప్రియా సులే ఎంఎన్‌ఎస్ చీఫ్ రాజ్‌థాకరేను లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. రాజ్‌ఠాక్రే శనివారం మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ పేరును ఎప్పుడూ ప్రస్తావించని శరద్ ప్రవార్ ప్రస్తుతం ఆయనను స్మరిస్తున్నారు.ఆయన తన ప్రసంగాల్లో ఛత్రపతి శివాజీ మహరాజ్ పేరును తీసుకుంటే ముస్లింల ఓట్లు పడవని భయపడి ఉండవచ్చన్న ఆయన.. ప్రస్తుతం పేరును ప్రస్తావిస్తున్నారన్నారు. దీనిపై సుప్రియా సూలే స్పందిస్తూ శరద్ పవార్ పేరు తీసుకోకుండా అతను(రాజ్‌థాక్రే) ప్రజల దృష్టిని ఆకర్షించలేడు అంటూ ఎంఎన్‌ఎస్ చీఫ్ పేరు ప్రస్తావించకుండా విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది ప్రజాస్వామ్య దేశమని.. పార్టీ, ఎన్నికల గుర్తు ఉండడం మన హక్కు అన్నారు. పార్టీని శరద్ పవార్ స్థాపించారు. దాన్ని ఆయన నుంచి లాక్కున్నారని.. పార్టీ, ఎన్నికల గుర్తు ఉండడం మన హక్కు అని, అందుకే కోర్టుకు వెళ్లామన్నారు. కోర్టు నిష్పక్షపాతంగా వ్యవహరించినందుకు ధన్యవాదాలు..ఎన్నికలకమిషన్‌కు సైతం కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

### లోకో పైలెట్ లేకుండా

## 70 కిలోమీటర్లు పరుగులు తీసిన గూడ్స్ రైలు



కథువా: లోకోపైలట్ లేకుండా 70 కిలోమీటర్లు ట్రాక్‌పై రైలు పరిగెత్తిన ఘటన జమ్మూలోని కథువాలో జరిగింది. ఆదివారం ఉదయం గూడ్స్ రైలు లోకోపైలట్ లేకుండా రైల్వే ట్రాక్‌పై పరుగులు తీసింది. హ్యాండ్‌బ్రేక్ వేయకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని అధికారులు చెబుతున్నారు. రైలు కదలడం స్టార్ట్ అయినప్పుడు అక్కడ లోకోపైలట్ లేడు. వెంటనే సమాచారం అందుకున్న అధికారులు ముందస్తు స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. రైలు 70 కిలోమీటర్లు పరిగెత్తిన తర్వాత దసుహా వద్ద నిలిపివేశారు. ఈ రైలు తనంతట తానుగా నడుస్తోందని, లోకోపైలట్ లేదని తెలుసుకున్న స్థానిక ప్రజలు ఆశ్చర్యపోయారు. దీంతో వారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఉదయం 8.47 గంటలకు క్రషర్లతో నిండిన గూడ్స్ రైలు జమ్మూలోని కథువా స్టేషన్ నుంచి పంజాబ్‌లోని హోషియార్ పూర్ వైపు వేగంగా పరుగెత్తడం ప్రారంభించింది. సమాచారం అందిన వెంటనే రైల్వే అధికారులు రైలును ఆపేందుకు ప్రయత్నించారు. ఏటవాలుగా ఉన్న మార్గం కారణంగా రైలు వేగం పుంజుకుంది. రైలు మార్గంపై అధికారులు నిరంతరం అప్‌డేట్‌లు ఇచ్చారు. చివరకు కథువా నుంచి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న హోషియార్‌పూర్‌లోని దాసుహా వద్ద వ్యయప్రయాసలకోర్చి రైలును ఆపారు.

## రాహుల్ గాంధీపై జయంత్ చౌదరి సెటైర్లు



లక్నో: కాంగ్రెస్ కీలక నేత, వాయనాడ్ ఎంపీ రాహుల్‌గాంధీని ఉద్దేశించి రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ అధ్యక్షుడు జయంత్ చౌదరి వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఇటీవల భారత్ జోడో న్యాయ్ యాత్ర వారణాసికి చేరుకున్న సందర్భంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఆయన సెటైర్‌లు వేశారు. వారణాసిలో తన యాత్ర సందర్భంగా జనం తప్పతాగి రోడ్లపై తూలుతూ కనిపించారని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ సొంత నియోజకవర్గంలో పరిస్థితులు ఇలా ఉన్నాయని చెప్పే ఉద్దేశంతో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తప్పుపట్టింది. వారణాసి ప్రజలను తాగుబోతులు అంటాడా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో 'రాహుల్‌గాంధీ యాత్రకు నేను శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. కానీ, ఆయన యాత్రగా ఇక్కడికి రావద్దు, ఇక్కడి ప్రజలను తాగుబోతులు అని కించపర్చవద్దని నేను ఆశిస్తున్నా' అంటూ జయంత్ చౌదరి సెటైరికల్ కామెంట్స్ చేశారు. ఇటీవలే జయంత్ చౌదరి ఇండియా కూటమిని వీడి ఎన్డీయే కూటమిలో చేరారు.




**ఏపీకి జగన్ హానికరం 2024 లో జగన్ ను బ్యాన్ చేద్దాం**